వరిలో వెదజల్లే పద్ధతి మేలు

- మండలవ్యాప్తంగా 5వేల ఎకరాల్లో సాగు
- నూతన ఒరవడి వైపు రైతుల అడుగులు


వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పైరు

ఖానాపురం : వరి పంట సాగులో రైతులు నూతన ఒరవడి వైపు అడుగులు వేస్తున్నారు.. మండల పరిధిలోని అన్నదాతలు వరి సాగులో నాటుకు బదులుగా వెదజల్లే పద్ధతిని ఎంచుకుంటున్నారు. నాటు వేసే విధానం, వెదజల్లే విధానంలో దిగుబడుల్లో స్వల్ప తేడాలు మాత్రమే ఉండటంతో రైతులు వెదజల్లే విధానం వైపు మరలి సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. వెదజల్లే పద్ధతి సాగులో పంటకాలం కాస్త ముందస్తుగానే వస్తుండటంతో పాటు చీడపీడలు, తెగుళ్లు ఆశించడం తక్కువగా ఉంటాయి.

పాకాల ఆయకట్టు కింద అధిక సాగు

ధాన్యాగార కేంద్రంగా పాకాల ఆయకట్టు గుర్తింపు పొందింది. పాకాల ఆయకట్టు కింద 29,500 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. ఖానాపురం మండల పరిధిలో సుమారు 18,500 ఎకరాల్లో వరి పంటను అన్నదాతలు పండిస్తున్నారు. పాకాలలో నీరు పుష్కలంగా ఉండటంతో వర్షాకాలంతో పాటు యాసంగిలోనూ పంటలు సాగు చేస్తున్నారు. మూడేళ్లుగా రైతులు వరి పంట సాగులో నూతన ఒరవడిని అనుసరిస్తున్నారు. నాటువేసే విధానానికి స్వస్తి పలికి వెదజల్లే పద్ధతిని అవలంబిస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు. వెదజల్లే విధానంలో నారుమడి సిద్ధం చేసుకోవడంతో పాటు నాటు వేసే అవకాశం లేకుండా ఉంటుంది. ఎకరానికి 15 కిలోల ధాన్యం బస్తాను తీసుకువచ్చి పంటపొలాన్ని సిద్ధం చేసుకోని నేరుగా భూమిలో చల్లుకుంటున్నారు. దీంతో నాటువేసే కూలీల సమస్య తగ్గుతుంది. వెదజల్లే పద్ధతి సులభంగా ఉండడంతో రైతులు అటువైపు అడుగులు వేస్తున్నారు. ఖానాపురం మండల పరిధిలో ప్రస్తుతం రైతులు సుమారు 35,00 ఎకరాల నుంచి 5,000 ఎకరాల వరకు వెదజల్లే విధానంలో వరి పంటలను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల ద్వారా తెలిసింది.

31 ఎకరాల్లో సాగు చేస్తున్న..



నాకున్న 31 ఎకరాల భూమిలో వెదజల్లే విధానంతో వరి పంటను సాగు చేశాను. దిగుబడులు కూడా నాటు విధానానికి సమానంగానే వస్తుంది. స్వల్పంగా మాత్రమే దిగుబడి తేడా ఉన్న ఈ పద్ధతితో నాటువేసే ఇబ్బందులు తగ్గుతున్నాయి. నాటు వేసే విధానానికి, వెదజల్లే విధానానికి సుమారు రూ.5వేల తేడా ఉంటుంది. వెదజల్లే పద్ధతి కూడా రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. - వేజేళ్ల కిషన్‌రావు, రైతు, ఖానాపురం

పురుగుల బెడద తక్కువ



వెదజల్లే పద్ధతిలో చీడపీడలు, తెగుళ్లు ఆశించడం తక్కువగా ఉంటుంది. మండల పరిధిలో మూడేళ్ల నుంచి వెదజల్లే విధానంలో సాగు చేస్తున్నారు. సుమారు 2 క్వింటాళ్ల మేర తక్కువగా వచ్చే అవకాశం ఉన్నప్పటికి సాగులో ఖర్చు కూడా తగ్గుతుంది. వారం పంట ముందుకు రావడంతో పాటు విత్తన ఖర్చు తగ్గుతుంది - బోగ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రణధీర్‌రెడ్డి

దుగ్గొండి : విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గం ఎంచుకొని ఆ దిశగా పయనించాలని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శవాణి విద్యాలయంలో మాదక ద్రవ్యాల వినియోగం, అతిగా మొబైల్ వాడటంపై జరిగే అనర్థాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, కష్టాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. మొబైల్ వాడకం వల్ల ఎంత మంచి ఉందో అంతకంటే చెడు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మంచి స్థానంలో స్థిరపడి తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శవాణి విద్యాసంస్థల చైర్మన్ నాగనబోయిన రవి, డైరెక్టర్ బత్తిని కవిత, ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రెపుడెక్క తొలగింపు


గుర్రపుడెక్కను తొలగిస్తున్న సిబ్బంది

నర్సంపేట : పదో వార్డులోని పెద్ద కాల్వలో భారీ వర్షాలకు గుర్రపుడెక్క కొట్టుకువచ్చి వర్షపు నీరు బయటికి వెళ్లకపోవడంతో నీరు రోడ్లపైకి చేరుకొని ఇళ్లలోకి రావడంతో స్థానికులు మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పద్మప్రసాద్ మున్సిపల్ అధికారులు, కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌కు తెలియజేయ డంతో అధికారులు పొక్లెయినర్ సాయంతో గుర్రపుడెక్కను తొలగించారు. కార్యక్రమంలో ఎదురబోయిన రామస్వామి, పస్తం కృష్ణ, గుగులోత్ గణేష్, మల్యాల శ్రీను, తోటకూరి నర్సింహరాములు, మద్దెల శ్రీను, కోట సురేష్, తదితరులు ఉన్నారు.

పేదల ఇళ్లను కూల్చడం సరికాదు


ఇళ్లను పరిశీలిస్తున్న పెద్దారపు రమేశ్ తదితరులు

గీసుకొండ : పేదలు నిలువ నీడ కోసం వేసుకున్న ఇళ్లు, గుడిసెలను కూల్చడం సరికాదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మొగిలిచర్ల శివారులోని పోగుల ఆగయ్యనగర్‌లో కూల్చివేసిన ఇళ్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదల పక్షాన ఉండాలని, రియల్టర్లకు అనుకూలంగా ఉండవద్దన్నారు. ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల ఇంటి స్థలాలకు ప్రభుత్వం పట్టాలిచ్చి ఆదుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, నాయకులు గనిపాక రేణుక, సదానందం, చంద్రమౌళి, అరున్, మరియ, కుమారస్వామి, శ్రీకాంత్, రవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పశువులకాపరి మృతదేహం లభ్యం

పర్వతగిరి: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కందికట్ల కట్టయ్య పశువులను మేపడానికి వెళ్లి ఆకేరువాగులో గల్లంతైన విషయం విదితమే. రెండ్రోజులుగా తీవ్రంగా గాలించిన పర్వతగిరి పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రవీందర్, పర్వతగిరి సీఐ రాజగోపాల్ పర్యవేక్షణలో ఉప్పలయ్య మృతదేహాన్ని బుధవారం ఆకేరు వాగులో గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. గాలింపు చర్యల్లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి, కానిస్టేబుల్ రాజు, సుందర్‌లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం


గోపికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

నెక్కొండ : తోటి స్నేహితుడి కుమార్తె వివాహానికి ఆర్థికసాయం అందించి ఆదర్శంగా నిలిచారు, మిత్రులు. నెక్కొండలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 పదో తరగతి చదివిన మోడెం గోపి పక్షవాతంలో బాధపడుతున్నాడు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో బుధవారం జరిగిన గోపి కుమార్తె సంజన వివాహానికి చిన్ననాటి స్నేహితులు హాజరై దీవించి, రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. కోమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, పెండ్యాల శ్రీనివాస్, మునిగె ప్రభాకర్, దాసరి శ్రీనివాస్, రమేశ్, అశోక్, ఖాజా, దేవేందర్, యాకూబ్‌పాషా, భద్రయ్య, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సంగెం: షాపూర్‌లో ఆర్టీసీ బస్సును ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం : భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం సంగెం మండలంలోని కాట్రపల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య గల బ్రిడ్జి ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక రహదారి నిర్మాణం, శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని అధికారుల సూచనలు పాటించాలన్నారు.

మహాలక్ష్మితో ఆర్టీసీ బలోపేతం..

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ ఆర్థికంగా బలోపేతం అవుతోందని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని షాపూర్ గ్రామానికి లోహిత, రామచంద్రపురం గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను రిబ్బన్ కట్ చేసి స్వయంగా నడుపుతూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మొదటిసారిగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్నదన్నారు. కర్ణాటక, తెలంగాణలో అమలు చేస్తున్న ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాల్లోను అమలు చేయబోతున్నారని తెలిపారు. ఇప్పటివరకు 200 కోట్లకు పైగా టికెట్లతో ఆర్టీసీకి రూ.6వేల కోట్లు లాభం వచ్చిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల సౌకర్యం కోసం ప్రవేశపెట్టుతున్న బస్సు సర్వీసులను అన్నివర్గాలవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, పీఆర్ డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ అభిరామ్, పార్టీ మండల అధ్యక్షుడు మాదవరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, అంజన్‌రావు, సంధ్య, వీరమ్మ, రాజు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు: ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల్లో ఉండే ప్రజలు వెంటనే దగ్గరలోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి బుధవారం మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రానున్న రెండు, మూడ్రోజుల్లో భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం సమయంలో చెట్ల కింద, శిథిలావస్థ భవనాల్లో ఉండరాదన్నారు. అలాగే రైతులు కరెంటు వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు ముట్టుకోరాదని అన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాల్వలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లరాదన్నారు. చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. ప్రజలు అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ విభాగాలు, రక్షణ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


గీసుకొండ: ఊకల్‌హవేలి చెరువు మత్తడిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రియాజుద్దీన్


కాట్రపల్లి వద్ద వాగును పరిశీలిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్ కోరారు. బుధవారం మండలంలోని పలు చెరువులను ఆయన పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని, లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. ఆర్ఐ సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు శుద్ధి


సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు వార్ మెమోరియల్ పరిశుభ్రత డ్రైవ్‌లో భాగంగా బుధవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్ పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం వారి ప్రాణాలను సైతం తాగ్యం చేసిన గొప్ప మహనీయులు అన్నారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శుద్ధి చేసే అదృష్టం దక్కడం గర్వంగా ఉందన్నారు. మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రతీ ఒక్కరు తమతమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులతో యువత జాగ్రత్తగా ఉండాలని, అతి చిన్న వయస్సులోనే ఉరి కొయ్యను ముద్దాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పాదిల రామ్‌చందర్, జూలూరి మనీష్‌గౌడ్, సుంకరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత, ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, రూరల్ ఉపాధ్యక్షుడు భూసాని సుదర్శన్, సీనియర్ నాయకులు గాదగోని అనిల్, పొనుగోటి రవీంద్రచారి, ముత్యాల శ్రీనివాస్, వినోద్, యువమోర్చా జిల్లా కార్యదర్శి చిలువేరు అన్వేష్, పట్టణ యువమోర్చా అధ్యక్షుడు దప్పెట్ల సతీష్, గోలి యుగంధర్, వెంకటేశ్వర్లు, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఖానాపురం : రైతులు, ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోకెన్ల పేరుతో రైతులను వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. గంటల తరబడి గోదాంల వద్ద రైతులు పడిగాపులు కాస్తే రెండు బస్తాలు మాత్రమే దక్కుతుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులను క్యూలో నిలబెట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇళ్లలోకి వెళ్లి టోకెన్లు ఇస్తున్నారని ఆరోపించారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే మాధవరెడ్డి ఏం చేస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు బంధారపు శ్రీనివాస్, జాటోత్ బాలు నాయక్, మౌలానా, భూక్య వెంకన్న, బోడ పూలు నాయక్, బాలు, మునీందర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మతల్లి బోనాలు


వర్ధన్నపేట: బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద, కొత్తపల్లి గ్రామాల్లో పోచమ్మ తల్లి బోనాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి మొదటి బోనం విశ్వ బ్రాహ్మణులు సమర్పించగా, పద్మశాలీలు మగ్గంతో నేసిన చీరను సమర్పించారు.

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పోచమ్మ తల్లికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పు, చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ర్యాలీగా పోచమ్మ దేవాలయాలకు వెళ్లి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. పాడి పంటలు బాగుండాలని, పిల్లా, పాపలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

పోచమ్మతల్లి దీవెనలు ఉండాలి

రాయపర్తి : పోచమ్మతల్లి దీవెనలు మండలవాసులపై ఉండాలని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాగన్నగూడెంలోని పోచమ్మగుడి మరమ్మతులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయించగా శ్రీనివాస్‌రెడ్డి గుడిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి బోనాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. మూనావత్ నర్సింహనాయక్, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్ గౌడ్, భూక్య సురేందర్‌రాథోడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర రవీందర్‌రెడ్డి, గారె నర్సయ్య, ఐత రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


దుగ్గొండి: గిర్నిబావిలో బోనాలతో వెళ్తున్న మహిళలు


రాయపర్తి : బోనంతో వస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సోలార్ లైట్ బ్యాటరీలు చోరీ



నర్సంపేట రూరల్ : సోలార్ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన బాక్స్‌లోని బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం చోరీ చేశారు. నర్సంపేట మండలంలోని భానోజీపేట గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి స్నేహలత కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భానోజీపేటలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ లైట్ల బ్యాటరీలను దొంగలించారు. స్థానికులు గమనించే సరికి బాక్స్ ధ్వంసమై ఉండడంతో పంచాయతీ కార్యదర్శి స్నేహలత నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

రాయపర్తి : లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోని బిల్లులు పొందాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ఊకల్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు పలు సూచలను చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకునే వారికి బిల్లులు అందుతాయన్నారు. ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే అధికారులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కేశవాపురం గ్రామానికి చెందిన చిలుముల ఎల్లమ్మ, కొలన్‌పల్లిలో కొమ్ము కొంరయ్య, గాజుల విజయ, గుడిమాడి రాజుల రాకేష్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూక్య సమ్మయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, మాజీ సర్పంచ్ ఎండీ ఉస్మాన్, ఎండీ నయీం, ఐరెడ్డి ఎల్లారెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు బూడిద రవి, పాల శ్రీనివాస్, డీజే శ్రీను, దీకొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవయవదానం గొప్పది


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

నర్సంపేట రూరల్ : అన్ని దానాల్లోకెల్లా అవయవదానం గొప్పదని ఫార్మాసూటిక్స్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటరమణ సూచించారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ కళాశాలలో ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన సదస్సును ఐక్యూఏసీ సెల్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తేనే ఆనందంగా జీవితాన్ని గడుపుతారన్నారు. శరీరంలోని కీలక అవయవాలు విఫలమైనప్పుడు కిడ్నీ, మెదడు, గుండె, కాలేయం, రక్తం, కంటి కార్నియాలు దానం చేసి మరో మనిషిని బతికించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పుట్ట రవి, మనీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నర్సంపేట : హనుమకొండలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కార్యాలయంలో ఈనెల 16న నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్, వరంగల్ జిల్లా చైర్మన్ ద్యాగల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నర్సంపేటలోని కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ జిల్లాల చైర్మన్లతో పాటు కమిటీ బాధ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బేతి భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరి రవి, జిల్లా కౌన్సిల్ మెంబర్స్ మద్దెల శ్యాంకుమార్, గుండు బాబ్జీ, కర్రి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

సంగెం : వివాహిత అదృశ్యమైన ఘటన కాట్రపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన కొత్తూరు రమ, రాజుల చిన్న కూతురు స్వాతిని (20), సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన వర్కాల రవీందర్‌తో ఈ ఏడాది ఏప్రిల్ 23న వివాహం చేశారు. పెళ్లి అయిన నెల వరకు సజావుగానే ఉన్న దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. డబ్బులు కావాలంటే స్వాతి తల్లిదండ్రులు రూ.60 వేలు అప్పుగా ఇప్పించారు. తర్వాత అత్త, మామలు ఓర్వడం లేదని చెప్పుకుంది. ఈ నెల 12వ తేదీన వరంగల్‌లోని ఏఎస్ఎం కళాశాల సమీపంలో గల బేకరిలో రవీందర్, పక్కనే ఉన్న ఐస్‌క్రీం పార్లర్‌లో స్వాతి పనికి వెళ్లారు. అక్కడ భార్యభర్తలు గొడవ పడ్డారు. దీంతో స్వాతి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఈ విషయం తల్లిగారికి చెప్పడంతో కాట్రపల్లికి వచ్చి అల్లుడిని అడిగితే ఎక్కడ చచ్చిందో చూసుకోమని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. ఎక్కడ వెతికినా జాడలేదని స్వాతి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని వివరించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సంగెం పోలీస్ స్టేషన్ 87126 85029, ఎస్సై 87126 85243 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అవసరం మేరకు యూరియా కొనుగోలు చేయాలి



ఐనవోలు : ప్రస్తుత పంట అవసరం మేరకే రైతులు యూరియా బస్తాలు కొనుగోలు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) దోమ ఆదిరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఎఫ్ఎస్‌సీఎస్ నందనం, ఏఆర్ఎస్‌కే పంథిని, లక్ష్మీ ఫర్టిలైజర్ డిపో ఐనవోలులను ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను రిజిస్టర్‌తో పాటు గోదాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 120–130 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పంటల విస్తీర్ణానికి తగ్గట్లు ఎరువుల స్టాక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. మార్కెట్‌లో యూరియా నిల్వలు లేవని ప్రచారంతో అవసరం లేకున్నా ముందస్తుగా ఎక్కువ యూరియా బస్తాలు రైతులు కొనుగోలు చేసి ఇంటివద్ద నిల్వలు చేసుకుంటున్నారన్నారు. ఎక్కువ మోతాదులో యూరియాను పంటలకు వాడకూడదన్నారు. పత్తి, మొక్కజొన్న పంటలకుపై నానో డీఏపీ, యూరియాను పిచికారీ చేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చని తెలియజేశారు.